క్లుప్తంగా

నెమలి దేవస్థానం ఆదాయం రూ. 2.56 లక్షలు

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం వివిధ అంశాలకు సంబంధించి నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ. 2.56 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ డి. శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. ఏడాది పాటు ఆలయ ప్రాంగణంలో పొంగలి తయారీకి భక్తులకు గ్యాస్‌సరఫరా చేసేందుకు నిర్వహించిన పాటను నెమలికి చెందిన పామర్తి వెంకటకృష్ణ రూ.1.66లక్షలకు, వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేసుకునేందుకు నిర్వహించిన పాటను గ్రామానికి చెందిన మనుబోలు శ్రీను రూ. 90వేలకు కైవసం చేసుకున్నారన్నారు. బొర్రగూడెం తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ మోహనరావు పర్యవేక్షణలో సిబ్బంది పాటను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కే. శశిరేఖ, పాలకవర్గ సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, కుంభగిరి వెంకటకృష్ణ, తోటకూర వీర ప్రసాద్, కూరకుల వెంకటకృష్ణ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి లబ్ధిదారులకు తాజాగా ఆర్థిక సాయం మంజూరైంది. మండలంలో ఎనిమిది మందికి రూ.4.66 లక్షలు మంజూరు కాగా స్థానిక పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులు షేక్ మహబూబ్ సుబానీ, చనుమోలు జయంతిరావుకు పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు ఎన్.శివశంకరరావు, సచివాలయాల కన్వీనర్ల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు సోమవారం అందజేశారు. లబ్ధిదారులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

నూజివీడు: మండలంలోని మీర్జాపురం సొసైటీ సభ్యుడు ఓలేటి వీర భాస్కరరావు ఈ నెల 15వ తేదీన మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులు సుంకర జై కిరణ్‌కు సోమవారం సొసైటీ అధ్యక్షులు బడుగు రంగారావు రూ.10 వేల సాయాన్ని అందజేశారు. కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు నిర్ణయం మేరకు ఈ సాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ నీలం నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దండుబోయిన రవి, గొల్లపల్లి నాగరాజు పాల్గొన్నారు.

రఘునందన్‌కు అభినందన



తిరువూరు: భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు జీవిత విశేషాలను వెలుగులోకి తెచ్చిన రేపాక రఘునందన్‌ను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అభినందించారు. ఆదివారం రాత్రి అమరావతీ సాహితీ మిత్రులు ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన కార్యక్రమంలో రఘునందన్ రచించిన పైడిమర్రి జీవితచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన్ను సన్మానించారు. రచయితలు కంచర్ల విజయభాస్కర్, రమణ యశస్వి, రావి రంగారావు పాల్గొన్నారు.

గోల్డ్‌కాయిన్ అందజేత



రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్‌లో పాలు పోసి, యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి.సాంబమూర్తి అన్నారు. రెడ్డిగూడెం మండలంలోని ముచ్చనపల్లి సంఘంలో పాలు పోస్తున్న ఎం. కిషోర్ కమార్తె దుర్గాదేవికి వివాహం సందర్భంగా కల్యాణ మస్తు పథకం ద్వారా రూ.20వేలు విలువ చేసే గోల్డ్ కాయిన్‌ను సోమవారం అందజేశారు.

బీజేపీని గద్దె దించుదాం

మైలవరం: బీజేపీని గద్దె దించుదామని, దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.సీహెచ్. శ్రీనివాస్ తెలిపారు. మైలవరం సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలపై గొంతు ఎత్తాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని శ్రీనివాస్ తెలిపారు. అనంతరం సీపీఎం ప్రచార భేరీ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్.రమేష్ పాల్గొన్నారు.

పోరాటనగర్ తండాలో..

పోరాటనగర్ తండా(మైలవరం): కేంద్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపి మన దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని సీపీఐ నాయకులు కొలకలూరి సీతయ్య పేర్కొన్నారు. లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో ఈ నెల 14 నుంచి 30వ తేదీవరకు దేశవ్యాప్తంగా సీపీఐ, సీపీఎం చేపట్టిన ప్రచార భేరీ సోమవారం మైలవరం మండలం కనిమెర్ల తండా, కత్తుల తండా, నాగులూరు తండా, పోరాటనగర్‌లో నిర్వహించారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న యూపీహెచ్‌సీ

- రూ.80 లక్షలతో నిర్మాణం
- పూర్తికావచ్చిన తిరువూరు అర్బన్ హెల్త్ సెంటర్ పనులు



తిరువూరులో ప్రారంభానికి సిద్ధమవుతున్న యూపీహెచ్‌సీ భవనం

తిరువూరు: నగరపంచాయతీగా అప్‌గ్రేడ్ అయిన తర్వాత తిరువూరు పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా వైద్యసేవలను మెరుగుపరచేందుకు నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో చేపట్టిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన పనులు పూర్తికావచ్చాయి. రూ.80 లక్షలతో 2021 అక్టోబర్ 11న ఈ భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఔట్‌పేషెంట్లకు వైద్యసేవలతో పాటు ఇన్ పేషెంట్లకు అవసరమైన సదుపాయాలు, రక్తపరీక్షలు, అత్యవసర వైద్యం అందించడానికి అవసరమైన గదులను నిర్మించారు. ప్రస్తుతం పాతబస్టాండు సెంటర్లోని భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న యూపీహెచ్‌సీని త్వరలో పక్కా భవనంలోకి తరలించనున్నారు.

సత్వర వైద్యసేవలకు అవకాశం

తిరువూరులో ఇప్పటికే కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా రోజూ 500మంది ఔట్‌పేషెంట్లకు వైద్యసేవలందుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకూ సీహెచ్‌సీలో ఉచిత వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కూడా ఈ ఆస్పత్రిలో పలు వ్యాధులకు చికిత్స చేస్తున్నారు. మండలంలోని చౌటపల్లి, రాజుగూడెంలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా రోజూ మరో 500 మంది ఔట్‌పేషెంట్లకు వైద్యసేవలందుతున్నాయి. తిరువూరులో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ప్రారంభిస్తే పట్టణంలోని రోగులకు మరింత సత్వర వైద్యసేవలందించే అవకాశం ఉంటుంది.

త్వరలోనే ప్రారంభిస్తాం

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. త్వరలోనే ఈ భవనాన్ని ప్రారంభించి, రోగులకు వైద్యసేవలు అందిస్తారు. పట్టణంలోని రోగులు ఈ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవచ్చు.

– రక్షణనిధి, తిరువూరు ఎమ్మెల్యే



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా సోమవారం ముస్లింలకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. విజయవాడ విద్యాధరపురంలోని స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అక్రమాలకు పాల్పడలేదని ప్రమాణం చేస్తా..

- నీ ఆరోపణలు నిజమని ప్రమాణం చెయ్యి..!
- వెంకటేశ్వరరావుకు సవాల్ విసిరిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్



మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: తనపై, తన కుమారుడిపైన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు చేస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గుడిలో ప్రమాణం చేయడానికి తాను సిద్ధమేనని, వెంకటేశ్వరావు సిద్ధమైతే తనకు 18వ తేదీన తెలియజేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చాలెంజ్ చేశారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కోవెలలో గాని, కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయంలో గాని తాను ఎలాంటి అవకతవకలు పాల్పడలేదని ప్రమాణం చేస్తానని, ముద్దరబోయిన తనపై చేసిన ఆరోపణలు నిజమేనని ప్రమాణం చేయాలన్నారు. ప్రతిసారీ తనపై అవాస్తవ ఆరోపణలు చేయడం అలవాటుగా మారిందని, ఇంతటితో దీనికి ఫుల్‌స్టాప్ పెడతానని స్పష్టం చేశారు. ఇక నుంచి ముద్దరబోయిన చేసే ఆరోపణలకు తమ పార్టీ నాయకులే సమాధానం చెప్తారన్నారు. నీ దగ్గర ఏమైనా ఆధారాలుంటే రా.. చిన్నగాంధీబొమ్మ సెంటర్‌కో, పెద్దగాంధీబొమ్మ సెంటర్‌కో రా...కాస్కో.... లేనిపక్షంలో ఒంగోలు వెళ్లిపో అంటూ మండిపడ్డారు. ముసునూరు మండలం లోపూడిలో టీడీపీ నాయకులు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కలిసి తహసీల్దార్‌ను మభ్యపెట్టి 120 ఎకరాల అటవీ భూమిని రికార్డుల్లో టీడీపీ నాయకుల పేరున రాయించారన్నారు. ఈ విషయం తనకు తెలిసి వెంటనే ఆ పేర్లను తొలగించేలా చర్యలు తీసుకున్నానన్నారు. ఆరు సార్లు పోటీ చేసి ఒక్కసారి మాత్రమే అదీ గన్నవరంలో నెగ్గిన ముద్దరబోయిన లాంటి చరిత్ర రాష్ట్రంలో ఇంకెవరికీ లేదన్నారు. సర్పంచ్, ఎంపీపీ, జెడ్పీటీసీగా గెలవలేని వ్యక్తి తనపై ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ప్రతాప్ భూములు ఆక్రమించారని ఆరోపణలు చేస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఎమ్మార్ అప్పారావు పేరు తలవడానికి కూడా ముద్దరబోయినకు అర్హత లేదన్నారు. ఎమ్మార్ అప్పారావు తన తండ్రికి కజిన్ బ్రదర్ అని, పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఏర్పాటు చేయడానికి ఇచ్చిన భూములు ఎవరివో పట్టణ ప్రజలందరికి తెలుసునని, ఎవరిని అడిగినా చెబుతారని అన్నారు. నూజివీడు ప్రాంతంలో గత నాలుగేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని, 2014–19 కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాని ముద్దరబోయినకు మాట్లాడే అర్హత కూడా లేదన్నారు. మండలంలోని నర్సపేటలో వెజిటబుల్, మ్యాంగో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అంతేగాకుండా స్టేడియం నిర్మాణాన్ని కూడా త్వరలోనే చేపడతామని, 2024లో కూడా గెలుపు తనదేనని స్పష్టం చేశారు. మీర్జాపురం ఎస్టేట్‌కు సంబంధించిన భూమిని వేరే వ్యక్తి అమ్మితే చిన్నం నారాయణరావు కొన్నాడన్నారు. దీంతో మీర్జాపురం ఎస్టేట్‌కు చెందిన వారసురాలు కాకుమాను స్రవంతి ఆర్డీఓ కోర్టులో, జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు వేయడంతో నారాయణరావుకు ఇచ్చిన పాసు పుస్తకాలను ఉన్నతాధికారులు రద్దు చేశారన్నారు. న్యాయం వైపే తాను సపోర్టు చేస్తానన్నారు. ఎవరో ఏదో చెబితే వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడితే అభాసుపాలు కావాల్సి వస్తుందని ఎమ్మెల్యే ప్రతాప్ హితవు పలికారు.

20న ఐటీఐలో జాబ్‌మేళా

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రధానాధికారి డీ భూషణం సోమవారం చెప్పారు. గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఏదైనా డిప్లొమా లేదా ఐటీఐ చదివిన అభ్యర్థులకు ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు నకళ్లతో హాజరుకావాలని పేర్కొన్నారు.

దేవినేని నెహ్రూకు నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ మంత్రి దేవినేని నెహ్రూ వర్ధంతి కార్యక్రమం కొండపల్లి బీకాలనీ వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం జరిగింది. 5వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ఈ సందర్భంగా బాటసారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

తిరువూరు: మండలంలో ఆధార్ కార్డుల కోసం డేటా ఎంట్రీ, పాత కార్డులలో డేటా మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 18న అక్కపాలెం, 19న కోకిలంపాడు, 20న మల్లేల, 26న ఆంజనేయపురం, 27న లక్ష్మీపురం గ్రామాల్లో ఈ కేంద్రాలను సచివాలయాల్లో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. సూరేపల్లిలో సోమవారం సాయంత్రం రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడిచేసి ఇద్దరిని అదుపులోనికి తీసుకుని, వారి నుంచి రూ.3,000 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితులను మంగళవారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఎస్సై తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలను పంచాయతీ పరిధిలోని మూడు పాఠశాలల్లో నాడు–నేడు పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ సోమవారం పరిశీలించారు. పెనుగొలను జెడ్పీ ఉన్నత, రెండు ఎలిమెంటరీ పాఠశాలల్లో నాడు–నేడు పథకంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు చేపట్టకపోవడంపై ఏపీసీ జి. మహేశ్వరరావు రెండు రోజుల క్రితం పర్యటనలో ఆగ్రహం వ్యక్త పరచిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన ఆదేశించారు. దీంతో ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులను ఎంఈఓ పరిశీలించారు.

వైఎస్సార్ జలకళను సద్వినియోగం చేసుకోవాలి

ఆగిరిపల్లి: రైతులు వైఎస్సార్ జలకళ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీతారామపురం సర్పంచ్ అత్తి మురళీమోహనరావు అన్నారు. గ్రామంలో రైతులకు మంజూరైన జలకళ బోరు పనులను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదేశాల మేరకు సర్పంచ్ మురళీమోహనరావు ఆధ్వర్యంలో సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



జి.కొండూరులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నాయకులు

జి.కొండూరు: కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు పంపిణీ చేయడం వల్లనే ప్రతి గడపకూ ధైర్యంగా వెళ్లగలుగుతున్నామని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. జి.కొండూరులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి గడపకు వెళ్లిన నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజాభిప్రాయాలను సేకరించారు.

రోలుపడిలో..

రోలుపడి(తిరువూరు): మండలంలోని రోలుపడిలో సోమవారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్‌పర్సన్ బండి రవికుమార్, గ్రామ సర్పంచ్ ముండ్లపాటి కాంతమ్మ, రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు డైరెక్టర్ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటరత్నం, గణేష్, నాగరాజు పాల్గొన్నారు.

సంక్షేమపథకాలతో సామాజిక మార్పు

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలతో సామాజిక మార్పు జరిగిందని వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని 16వ వార్డులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముగింపు సమావేశం నిర్వహించారు.

వెల్వడంలో..

వెల్వడం(మైలవరం): మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు వెల్వడం సొసైటీ అధ్యక్షుడు తోట తిరుపతిరావు తెలిపారు. మైలవరం మండలం వెల్వడంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు జెడ్పీటీసీ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాలు సోమవారం సాయంత్రం నిర్వహించారు. కాట్రేనిపాడులో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు., కార్యక్రమాల్లో ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ గంగాధర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న 98 డీఎస్సీ అభ్యర్థులు

విస్సన్నపేట: డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు ఎనిమిది మందికి మినిమమ్ టైం స్కేల్ కింద పోస్టులు రావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక విద్యాశాఖాధికారి కార్యాలయంలో నియామక పత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ చదల రామకృష్ణ, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు ఎస్‌వీ కుటుంబరావు, గృహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, ఎంపీటీసీ మల్లయ్య పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



నూజివీడులో స్పందన అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో ఎలాంటి అలసత్వం వద్దని, గడువులోగా అర్జీలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందనలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 13 అర్జీలు అందాయి. స్పందనలో డీఎల్‌పీఓ పీ వెంకటరత్నం, ట్రాన్స్‌కో టౌన్, రూరల్ డీఈలు ఓలేటి దుర్గారావు, ఎం.పోతురాజు, ఏడీఏ విద్యాసాగర్ పాల్గొన్నారు.

స్పందనలో మూడు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో మూడు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రాధికరాణి, ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో వాటర్ టెండర్ ద్వారా ప్రదర్శన నిర్వహిస్తున్న ఫైర్ సిబ్బంది



నూజివీడులో మంటను ఎలా ఆర్పాలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

నూజివీడు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి కె.భాస్కరరామమ్ సోమవారం పట్టణంలోని త్రివిధ స్కూల్‌లో విద్యార్థులకు, ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఫైర్ స్టేషన్ సిబ్బందితో పాటు త్రివిధ స్కూల్ ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

మైలవరం: అగ్నిప్రమాదం గమనించిన వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. మైలవరంలో అగ్నిమాపక వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా నాల్గో రోజు స్థానిక ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, లిటిల్ ఫ్లవర్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్స్‌లో అగ్నిమాపక సిబ్బంది సోమవారం మ్యాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అగ్ని ప్రమాదాలు, భద్రతపై వాటర్ టెండర్ ద్వారా ప్రదర్శన నిర్వహించి, అవగాహన కల్పించారు.

మామిడి తోటల పరిశీలన



నూజివీడు మండలంలో మామిడి తోటలను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

నూజివీడు: మండలంలోని మామిడి తోటలను ఉద్యానశాఖ అధికారులతో పాటు మామిడి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. అకాల వర్షాలకు మామిడికి మంగు ఆశించడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో అధికారులు అన్నవరం, హనుమంతులగూడెం, వెంకటాద్రిపురం, మిట్టగూడెం, దిగవల్లి, తూర్పుదిగవల్లి, ముక్కొల్లుపాడు, సుంకొల్లు, బత్తులవారిగూడెం, యనమదలలోని మామిడి తోటలను పరిశీలించారు. పలువురు రైతులు పూత, పిందె దశలో వచ్చిన తెగుళ్ల వల్ల కలిగిన నష్టాన్ని వారికి వివరించారు. అలాగే అకాల వర్షాల వల్ల మామిడికి వచ్చిన మంగు తెగుళ్లను వారికి చూపించారు. ఈ సందర్భంగా మామిడి పరిశోధనస్థానం శాస్త్రవేత్త కే రాధారాణి, డీహెచ్ జే శాంతి మాట్లాడుతూ ఇప్పటికే రైతులకు కలిగిన నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ ఆర్.హేమ, వీహెచ్ఏలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు రామకృష్ణకు తెలుగురత్న బిరుదు



రామకృష్ణను తెలుగు రత్న బిరుదుతో సత్కరిస్తున్న సెర్ప్ సీఈఓ ఇంతియాజ్, తదితరులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్రీయ విద్యాలయం ఉపాధ్యాయుడు, ఫింగర్ పెయింటర్ ఆత్మకూరు రామకృష్ణకు తెలుగురత్న అవార్డు వరించింది. ఉగాది మహోత్సవాలు పురస్కరించుకుని జయహో భారతీయం, తెలంగాణా అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఆఫ్రికా సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆయనకు తెలుగురత్న బిరుదుతో పాటు బంగారు పతకం అందజేసి సత్కరించారు. గతంలో పరికరాలు లేకుండా 13.26 గంటల్లో ఏకధాటిగా చేతివేళ్లతో 100 పెయింటింగ్స్, 100 యూట్యూబ్ ఎపిసోడ్స్ చిత్రించి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. చిత్రకళా రంగానికి వీరు చేసిన సేవలను గుర్తించి సన్మానించారు. అధికారభాషా సంఘం అధ్యక్షురాలు అలివేలు మంగాదేవి, సెర్ప్ సీఈఓ ఏఎండీ ఇంతియాజ్ పాల్గొన్నారు.

గంపలగూడెం సొసైటీలో నూరుశాతం రుణాల వసూలు

గంపలగూడెం: గంపలగూడెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రుణాలు నూరుశాతం వసూలు అయ్యాయని కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెమ్మిరాజు ఆంజనేయులు, సీఈఓ ఏ. శ్రీనివాసరావు, సిబ్బందిని ఆయన అభినందించారు. మేనేజర్ కంచర్ల కనకదుర్గ, సూపర్‌వైజర్ ఏసోబు, డైరెక్టర్ ఆడెపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నూజివీడు: పట్టణంలోని న్యాయస్థానాల ఆవరణలో భారత్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మండు వేసవిలో కోర్టుకు వచ్చే కక్షిదారులకు, పోలీసు సిబ్బందికి, న్యాయవాదులకు, ఉద్యోగులకు చల్లటి మంచినీటిని, మజ్జిగ ప్యాకెట్లను అందించేందుకు ముందుకు వచ్చిన భారత్ బార్ అసోసియేషన్‌ను అభినందించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్‌వీ సత్యనారాయణ, బసవరాజు రామకృష్ణ, సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసీం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డీ దుర్గా కల్యాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీ సాయిరామ్, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ విధులనుంచి మినహాయించాలి

తిరువూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేసే ప్రక్రియలో సహకార సంఘాల ఉద్యోగులను మినహాయించాలని ఏపీ పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం సభ్యులు సోమవారం తిరువూరు తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. తమకు సహకార సంఘాల్లో రుణాల మంజూరు, బకాయిల వసూళ్ల తదితర విధులతోనే అధిక సమయం సరిపోతున్నందున ఆర్బీకేలలో ధాన్యం సేకరణకు ఇతర ఉద్యోగులను నియమించాలని కోరారు. సంఘ జిల్లా కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం

జి.కొండూరు: వంట గ్యాస్ లీకై అగ్ని ప్రమాదం జరిగిన ఘటన జి.కొండూరులో బుధవారం జరిగింది. టమాటా మార్కెట్ సమీపంలోని బెజవాడ వెంకటరావు ఇంట్లో సోమవారం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.